
సాక్షి
కర్నూలు
శుక్రవారం । 19 । సెప్టెంబర్ । 2025



కొనసాగుతున్న నీటి విడుదల

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం జలాశయానికి వరద కొనసాగుతుండటంతో ఐదు రేడియల్ క్రస్ట్ గేట్ల ద్వారా 1,67,346 క్యూసెక్కుల నీటిని నాగార్జున సాగర్‌కు విడుదల చేస్తున్నారు.



బెడిసి కొట్టిన పాసింగ్ కుట్ర!

ఆదోని మార్కెట్ యార్డులో వ్యాపారుల కుట్ర బెడిసి కొట్టింది. ధర తగ్గించి వేరుశనగ కొనుగోలు చేసేందుకు వ్యాపారులు యత్నించగా రైతులు దిగుబడులను ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. 8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,626.06
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:80.003
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,539
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,283

ఆశలు కుళ్లిపోతున్నాయి!



కర్నూలు మార్కెట్‌కు వెల్లువెత్తిన ఉల్లి

పెట్టుబడి కూడా దక్కని ఉల్లిరైతు

- క్వింటా ఉత్పత్తికి రూ.1,750
- మద్దతు ధర నామమాత్రంగా రూ.1,200
- పంట అంతంతమాత్రంగా మార్కెట్‌లోకి వస్తేనే ఈ దుస్థితి
- పూర్తి స్థాయిలో వస్తే పరిస్థితి ఏమిటని ఆందోళన
- మద్దతు ధర రూ.2,000 పెంపునకు డిమాండ్

కర్నూలు(అగ్రికల్చర్): కూటమి ప్రభుత్వ హయాంలో మిరప, పత్తి, మామిడి, టమాట తదితర పంటలు సాగు చేస్తున్న రైతులు తీవ్ర నష్టాలను చవి చూస్తున్నారు. ఇప్పటికే యూరియా కొరత సతమతం చేస్తున్న సమయంలో మూలిగే నక్కపై తాటికాయ పడ్డట్లు ఉల్లి ధర కన్నీళ్లు పెట్టిస్తోంది. రాష్ట్రంలో ఉల్లి పండించే జిల్లాల్లో కర్నూలుదే అగ్రస్థానం. మహారాష్ట్రలోని పునే తర్వాత అత్యధికంగా ఉల్లి సాగవుతున్నది ఇక్కడే. అయితే ఇప్పుడున్న ధరలతో రైతు తీవ్ర ఆవేదన చెందుతున్నాడు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉల్లి సాధారణ సాగు విస్తీర్ణం 19,288 హెక్టార్లుకాగా (హెక్టార్ దాదాపు 2.5 ఎకరాలు) 15,704 హెక్టార్లలోనే సాగయింది. ఉద్యాన శాఖ గణాంకాల ప్రకారం హెక్టారుకు 150 క్వింటాళ్ల దిగుబడి వస్తోంది. దీని ప్రకారం చూస్తే, జిల్లా మొత్తంగా ఉల్లి ఉత్పాదకత అంచనా 23,55,600 క్వింటాళ్లు. అయితే ఇప్పటికే మార్కెట్‌లోకి వచ్చిన దిగుబడి 2,52,000 క్వింటాళ్లు. అంతంత మాత్రం మార్కెట్‌లోకి వచ్చిన ఉల్లిగడ్డలనే కొనేవారు లేరు. పూర్తి స్థాయి పంట మార్కెట్‌లోకి వస్తే పరిస్థితి ఏమిటని రైతులు వాపోతున్నారు.

క్వింటాకు తక్షణ నష్టం రూ.550

అప్పులు, పంట చేతికి వచ్చి అమ్ముకోవడానికి పట్టే నాలుగు నెలల కాలంలో వడ్డీల భారం వెరసి ఉల్లి రైతుకు పెను భారమవుతోంది. మొత్తంగా క్వింటా ఉల్లిగడ్డలు పండించి మార్కెట్‌కు తీసుకురావడానికి రూ.1,750 వరకు (కేజీకి రూ.17.50 చొప్పున) ఖర్చవుతోంది. కూటమి ప్రభుత్వం ఉల్లికి ఇస్తున్న మద్దతు ధర రూ.1,200 మాత్రమే. అంటే పెట్టుబడిలోనే క్వింటాపై రైతులు రూ.550 నష్టపోతున్నారు. ఈ పరిస్థితుల్లో పెట్టుబడి వ్యయాన్ని పరిగణలోకి తీసుకొని మద్దతు ధరను కనీసం రూ.2,000కు పెంచాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఇతర ప్రాంతాలకు వలస

ధర లేక నష్టాలు మూట కట్టుకుంటున్న రైతులు గిట్టుబాటు ధర కోసం వలస బాట పడుతున్నారు. ప్రభుత్వం రూ.1,200 మద్దతు ధర ప్రకటించినప్పటికీ పెట్టుబడి కూడా దక్కకపోవడంతో అనేక మంది రైతులు చిత్తూరు, తిరుపతి, గుంటూరు తదితర ప్రాంతాలకు ఉల్లిగడ్డలు తీసుకెళ్లి ప్రధాన రహదారులు, నగరాల్లోని ప్రధాన కూడళ్లలో అమ్మకాలు సాగిస్తున్నారు. రీటైల్ మార్కెట్‌లో కిలో రూ.20 ప్రకారం విక్రయిస్తున్నారు. ఇద్దరు, ముగ్గురు రైతులు లారీ తీసుకెళ్లి అమ్మకాలు చేస్తుండటం గమనార్హం.

జగన్ హయాంలో ఐదేళ్లూ హ్యాపీ

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉన్న ఐదేళ్లలో ఉల్లి రైతులు ఏ ఒక్క రోజు రోడ్డెక్కిన దాఖలాలు లేవు. ఉల్లి సాగు ఎక్కువగా ఉండటంతో పాటు వర్షాలు విస్తారంగా పడటం వల్ల దిగుబడి కూడా పెరిగింది. బంగ్లాదేశ్‌తో పాటు వివిధ దేశాలకు ఎగుమతులు అయ్యాయి. జిల్లా చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా రైతులకు ధర లభించింది. రికార్డు స్థాయిలో క్వింటా ఉల్లికి రూ.13,500 వరకు ధర లభించింది. ఆ ఐదేళ్లలో ఉల్లి సాగు చేసిన రైతులకు నష్టాల మాటే తెలియదు.

మద్దతు ధర ఎప్పుడు అందుతుందో..?



ఒకటిన్నర ఎకరాలో ఉల్లి సాగు చేశా. విత్తనాలు కొనడం మొదలు.. పంటను మార్కెట్‌కు తెచ్చే వరకు పెట్టుబడి వ్యయం దాదాపు రూ.2 లక్షల వరకు వచ్చింది. గ్రేడింగ్ చేయగా.. దిగుబడి మాత్రం 100 క్వింటాళ్లు వచ్చింది. ఉల్లిలో నాణ్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నప్పటికీ, వ్యాపారులు క్వింటా రూ.550 ధరతో కొన్నారు. ప్రభుత్వం మాత్రం మద్దతు ధర రూ.1,200 మాత్రమే నిర్ణయించింది. వ్యాపారులు రూ.550 ప్రకారం కొనగా.. మిగిలిన రూ.650 ప్రభుత్వం చెల్లిస్తుందని అధికారులు చెబుతున్నారు. అదీ ఎప్పటికి పడుతుందో తెలియని పరిస్థితి. మద్దతు ధర రూ.1,200 ఏ మాత్రం గిట్టుబాటు కాదు. రూ.2 లక్షలు పెట్టుబడి పెడితే రూ.1.20 లక్షలు చేతికి వస్తోంది. కనీసం రూ.2,000 మద్దతు ధర ఉండాలి.

– గోవిందు, బోగోలు, వెల్దుర్తి మండలం

పెట్టుబడిలోనే రూ.40 వేల నష్టం



రెండు ఎకరాల్లో ఉల్లి సాగు చేశాం. ఎకరాకు రూ.1.10లక్షల ప్రకారం రూ.2.20 లక్షలు పెట్టుబడి పెట్టాం. దిగుబడి రూ.150 క్వింటాళ్లు వచ్చింది. మార్కెట్‌కు తీసుకరాగా.. వ్యాపారులు క్వింటా రూ.320 ప్రకారం కొన్నారు. మద్దతు ధరలో గ్యాప్ అమౌంటు రూ.980 ప్రభుత్వం చెల్లిస్తుందని చెబుతున్నారు. ఎప్పటికి పడుతుందో తెలియని పరిస్థితి. పెట్టుబడి రూ.2.20 లక్షలు పెడితే ప్రభుత్వ మద్దతు ధరతో లెక్కించినా రూ.1.80 లక్షలు మాత్రమే వస్తోంది. పెట్టిన పెట్టుబడిలోనే రూ.40 వేలు నష్టం వస్తోంది.

– పాపన్న, దేవనకొండ

బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.25పైనే..

ఇక జిల్లాలోనే బహిరంగ మార్కెట్‌లో కిలో ఉల్లి ధర రూ.25పైగా ఉంది. రోడ్లపై రూ.100కు నాలుగు కిలోల ఉల్లి బోర్డుపై రాసి అమ్మకాలు సాగిస్తున్నారు. రైతు బజార్లలోనే కిలో రూ.25 ప్రకారం విక్రయిస్తున్నారు. సూపర్ మార్కెట్‌లు, మాల్స్‌లో కిలో ధర మరింత ఎక్కువే ఉంటోంది. ఉల్లి పండించే జిల్లాలోనే బహిరంగ మార్కెట్‌లో ఉల్లి ధరలు ఇలా ఉంటే, ఉల్లి పండించని జిల్లాల్లో ధరలు ఏ విధంగా ఉంటాయో ఊహించుకోవచ్చు. అయితే కూటమి ప్రభుత్వం ఇస్తున్న మద్దతు ధర మాత్రం కిలోకు రూ.12 మాత్రమే కావడం గమనార్హం.



కర్నూలులో రూ.100కు 4 కిలోల ప్రకారం ఉల్లి విక్రయాలు

న్యూస్‌రీల్

డంప్‌యార్డుకు 1,818 క్వింటాళ్ల ఉల్లిగడ్డలు

కర్నూలు(అగ్రికల్చర్): మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లికి వేలంపాట నిర్వహించగా 1,818 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను ఎవ్వరూ కొనుగోలు చేయలేదు. జాయింట్ కలెక్టర్ నవ్య ఆదేశాల మేరకు గరువారం నిర్వహించిన వేలంపాటలో 4905.45 క్వింటాళ్ల ఉల్లిని కొనుగోలు చేశారు. క్వింటాకు కనిష్ట ధర రూ.50 మాత్రమే లభించింది. గరిష్టంగా రూ.400తో కొన్నారు. 1,818 క్వింటాళ్ల ఉల్లిగడ్డలను కనీస ధరతో కూడా కొనేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో గార్గేయపురం వద్దనున్న డంప్ యార్డుకు తరలించనున్నారు. కాగా శుక్రవారం కూడా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి క్రయవిక్రయాలు జరగవని సెక్రటరీ జయలక్ష్మి తెలిపారు. కర్నూలు మార్కెట్‌లో ఉల్లి విక్రయాలు లేనందున ఎమ్మిగనూరు మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చేశారు. 18 మంది రైతులు ఉల్లి దిగుబడులను తెచ్చారు. జాయింట్ కలెక్టర్ నవ్య, మార్కెటింగ్ శాఖ జేడీ రామాంజనేయులు ఉల్లి విక్రయాలను పరిశీలించారు.

నేడు ఎమ్మిగనూరు, రేపు కర్నూలులో ఉల్లి కొనుగోళ్లు

కర్నూలు(సెంట్రల్): ఈనెల 19వ తేదీన ఎమ్మిగనూరులో, 20వ తేదీన కర్నూలు మార్కెట్ యార్డుల్లో ఉల్లిని కొనుగోలు చేయనున్నట్లు జేసీ డాక్టర్ బి.నవ్య గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఆయా తేదీల్లో మార్కెట్లకు ఉల్లిని తీసుకురావాలని సూచించారు.

2,183 కుటుంబాలకు అందని దీపం లబ్ధి

కర్నూలు(సెంట్రల్): జిల్లాలో సాంకేతిక కారణాలతో 2,186 కుటుంబాలు దీపం-2 పథకం లబ్ధిని అందుకోలేకపోయారని డీఎస్ఓ ఎం.రాజారఘువీర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ముఖ్యంగా బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్, ఎన్‌పీసీఐ లింకు కాకపోవడం, బ్యాంకు ఖాతా మనుగడలో లేకపోవడం తదితర కారణాలతో ఎక్కువ మందికి దీపం-2 పథకం లబ్ధి కలుగలేదన్నారు. సంబంధిత ఖాతాదారులు సాంకేతిక కారణాలను పరిష్కరించుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పాత నేరస్తులపై మొబైల్ సెక్యూరిటీ డివైజ్‌తో నిఘా



వేలిముద్రలను సేకరిస్తున్న గస్తీ పోలీసులు

కర్నూలు: జిల్లాలో దోపిడీ దొంగలు, గంజాయి స్మగ్లర్ల కదలికలు బయటపడటంతో పోలీసు శాఖ పాత నేరస్తులపై ప్రత్యేక దృష్టి సారించింది. పోలీసుల నుంచి తప్పించుకు తిరుగుతున్న నేరగాళ్లను గుర్తించేందుకు గస్తీ పోలీసులు మొబైల్ సెక్యూరిటీ డివైజ్‌తో వేలిముద్రలు సేకరిస్తూ నిఘాను తీవ్రతరం చేశారు. పాత నేరస్థుల జాబితాతో వేలిముద్రను పోల్చి చూసి విచారిస్తున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా బుధవారం రాత్రి జిల్లా అంతటా విస్తృత తనిఖీలు నిర్వహించారు. నేరాల కట్టడికి నిఘాతో పాటు రోడ్డు సేఫ్టీ నియమాలపై కూడా ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గస్తీ పోలీసులు చర్యలు చేపట్టారు.

ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు

- నూతన సీఎఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన ఐఎఫ్ఎస్ జీవీపీ కృష్ణమూర్తి



సర్కిల్ కార్యాలయంలో ఉద్యోగులకు సూచనలు చేస్తున్న సీఎఫ్ కృష్ణమూర్తి

కర్నూలు కల్చరల్: ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేస్తామని కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీఎఫ్)గా ఐఎఫ్ఎస్ బీవీపీ కృష్ణమూర్తి తెలిపారు. ఇటీవల చేపట్టిన ఐఎఫ్ఎస్‌ల బదిలీల్లో శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ఉన్న ఆయనను కర్నూలుకు బదిలీ చేశారు. ఆ మేరకు సీఎఫ్‌గా గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన సీఎఫ్‌గా బాధ్యతలు చేపట్టిన కృష్ణమూర్తికి నంద్యాల, కర్నూలు, కడప డీఎఫ్‌వోలు, రేంజ్ ఆఫీసర్లు, సర్కిల్ కార్యాలయం ఏఈవోలు ఉద్యోగులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ ఉద్యోగులందరూ నిబంధనల ప్రకారం బాధ్యతలను నిర్వర్తించాలన్నారు. అటవీ శాఖ కార్యాలయాలన్నీ సీసీ టీవీ పర్యవేక్షణలో ఉంటాయన్నారు. ఉద్యోగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూస్తామని, అయితే విధి నిర్వహణలో నిక్కచ్చిగా వ్యవహరించాలన్నారు.

దోచుకునేందుకే వైద్య కళాశాలల ప్రైవేటీకరణ



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి

- ప్రజలు వ్యతిరేకిస్తున్నా.. ప్రభుత్వం టెండర్లకే మొగ్గు
- ప్రైవేటుకు అప్పగిస్తే పనులను అడ్డుకుంటాం
- నేడు 'చలో ఆదోనికి' భారీగా తరలిరండి
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్): ఒక కత్తెర, రిబ్బన్ ఉంటే ప్రారంభించాల్సిన ప్రభుత్వ వైద్య కళాశాలలను సీఎం చంద్రబాబు నాయుడు ప్రైవేటుకు అప్పగించి భారీగా నిధులను దోచుకునేందుకు కుట్ర పన్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి విమర్శించారు. గురువారం స్థానిక ఎస్వీ కాంప్లెక్స్‌లో పార్టీ నేతలతో కలసి ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మంచి ఉద్దేశంతో రాష్ట్రంలో ఒకేసారి 17 వైద్య కళాశాలల నిర్మాణానికి శ్రీకారం చుట్టారన్నారు. పేద విద్యార్థులకు వైద్య సీట్లు అందడంతో పాటు పేద రోగులు ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చనే సంకల్పంతో శరవేగంగా నిర్మించారన్నారు. అటువంటి ప్రభుత్వ వైద్య కళాశాలలను మంత్రి లోకేష్ ఆయన బంధువులు, అనుయాయులు, మంత్రి నారాయణ, కామినేని బినామీ పేర్లతో కట్టబెట్టేందుకు చంద్రబాబు నాయుడు నిర్ణయించారన్నారు. ప్రభుత్వ కళాశాలల ప్రైవేటీకరణను రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ, సీపీఎం, విద్యార్థి, యువజన సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. అయినా కూటమి ప్రభుత్వం హడావుడిగా పులివెందుల, పాడేరు, మార్కాపురం, ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాలలను ఈ- ప్రొక్యూర్‌మెంటు టెండర్లు నిర్వహించి ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కూటమి తీరుకు వ్యతిరేకంగా ఆదోని ప్రభుత్వ వైద్య కళాశాల సందర్శనకు ఈనెల 19వ తేదీన 'చలో ఆదోని' కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ పిలుపునిచ్చిందన్నారు. జిల్లా, నియోజకవర్గ పార్టీ శ్రేణులు, విద్యార్థి, యువజన సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

బాబూ.. సంపద సృష్టించలేవా?

ఎన్నికల ముందు సంపద సృష్టించి అభివృద్ధి చేస్తానని చెప్పిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రైవేటుకు అప్పగిస్తుండటం దారుణమని ఎస్వీ మోహన్‌రెడ్డి విమర్శించారు. వాటిని ప్రారంభిస్తే మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మంచి పేరు వస్తోందోననే భయంతోనే బాబు పీపీపీ విధానానికి తెరలేపారన్నారు. ఏడాదిన్నర వ్యవధిలో రూ.2 లక్షల కోట్లు అప్పులు చేసిన ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే అందులో రూ.5 వేల కోట్లు ఖర్చు పెడితే రాష్ట్రంలో పేదలకు వైద్య విద్య, వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు.

విద్య, వైద్య రంగాలు సర్వనాశనం..

కూటమి పాలనలో విద్య, వైద్య రంగాలు సర్వనాశనం అయ్యాయని వైఎస్సార్‌సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సిద్ధారెడ్డి రేణుక విమర్శించారు. గత ప్రభుత్వం నాడు – నేడు కార్యక్రమం కింద మున్సిపల్, ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దితే, కూటమి ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేస్తుందన్నారు. వెనుకబడిన ప్రాంతం ఆదోనిలో జగనన్న ప్రభుత్వ వైద్య కళాశాలను ఏర్పాటు చేస్తే చంద్రబాబు నాయుడు ప్రైవేటుకు అప్పగిస్తుండటం సిగ్గుచేటన్నారు. 'చలో ఆదోని' కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో తరలిరావాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు షరీఫ్, శివారెడ్డి, కార్పొరేటర్లు విక్రమసింహారెడ్డి, క్రిష్ణకాంత్ రెడ్డి, తిరుమలేశ్వర రెడ్డి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్సీ నియామక పత్రాల పంపిణీ వాయిదా

కర్నూలు సిటీ: అమరావతిలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ పోస్టుల నియామక పత్రాల పంపిణీ కార్యక్రమం చివరి దశలో వాయిదా వేశారు. కార్యక్రమానికి బయలుదేరేందుకు అభ్యర్థులు, అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. మరి కొద్ది నిమిషాల్లో బయలు దేరాల్సిన సమయంలో విద్యాశాఖ ఉన్నతాధికారులు అమరావతి చుట్టు పక్క ప్రాంతాల్లో అధిక వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో కార్యక్రమం వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఇదే విషయాన్ని జాయింట్ కలెక్టర్ బి.నవ్య ధ్రువీకరించారు. కార్యక్రమం వాయిదాతో అభ్యర్థులు నిరుత్సాహంతో వెనుదిరిగారు.

బార్ల కేటాయింపు రెండో అంకం పూర్తి

- ఐదు బార్లకు ప్రొవిజినల్ లైసెన్సులు జారీ
- ఎమ్మిగనూరు, గూడూరు బార్లకు స్పందన కరువు
- మరోసారి నోటిఫికేషన్ విడుదల చేయనున్న అధికారులు



ఎక్సైజ్ టెండర్ల ప్రక్రియలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ డాక్టర్ బి.నవ్య

కర్నూలు: జిల్లాలో బార్ల కేటాయింపు రెండో అంకం ముగిసింది. గడువు పెంచిన (రీ నోటిఫికేషన్) ఏడు బార్లకు గాను గురువారం జిల్లాపరిషత్ సమావేశ భవనంలో ఐదు బార్లకు లాటరీ తీశారు. రెండో దశలో ఐదు బార్లకు నాలుగేసి దరఖాస్తులు రాగా వాటికి లాటరీ తీసి ప్రొవిజినల్ లైసెన్సులు జారీ చేశారు. ఇన్‌చార్జి కలెక్టర్ బి.నవ్య, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ సుధీర్ బాబు పర్యవేక్షణలో పోటీదారుల సమక్షంలో లాటరీ తీసి విజేతలకు కేటాయించారు. అసిస్టెంట్ కమిషనర్ హనుమంత రావు, ఏఈఎస్‌లు రామకృష్ణా రెడ్డి, రాజశేఖర్ గౌడ్, సీఐలు చంద్రహాస్, రమేష్ రెడ్డి, రాజేంద్రప్రసాద్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లాలో మొత్తం 26 బార్లు ఉన్నాయి. వీటికి గత నెల 18న మొదటి విడత నోటిఫికేషన్ విడుదల కాగా, 19 బార్లకు నాలుగేసి దరఖాస్తులు రావడంతో గత నెల 30వ తేదీ లక్కీ డిప్ నిర్వహించి విజేతలకు కేటాయించారు. ఏడు ఓపెన్ కేటగిరీ బార్లకు స్పందన కరువవ్వడంతో ఈ నెల 3వ తేదీన రీ నోటిఫికేషన్ ఇచ్చారు. అందులో కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 4, ఎమ్మిగనూరు మున్సిపాలిటీ పరిధిలో 2, గూడూరు నగర పంచాయతీలో ఒక బార్‌కు మొదటి విడతలో దరఖాస్తులు రాకపోవడంతో రీ నోటిఫికేషన్ ఇచ్చి నిబంధనల ప్రకారం దరఖాస్తులు వచ్చిన ఐదింటికి లక్కీడిప్ తీసి లబ్ధిదారులకు కేటాయించారు. పోటీ పడితే ప్రస్తుత పరిస్థితుల్లో గిట్టుబాటు కాదని వ్యాపారులు కూడబలుక్కుని ఒక్కరే నాలుగేసి దరఖాస్తులు వేసి కొందరు బార్లు దక్కించుకున్నారు. నిబంధనల మేరకు 6వ వంతు వార్షిక లైసెన్స్ రుసుం అదనపు ఆర్ఈటీ మొత్తాన్ని డీడీ రూపంలో చెల్లించారు. వెంటనే వ్యాపారాలు మొదలుపెట్టుకోవటానికి ఎక్సైజ్ అధికారులు ప్రొవిజన్ లైసెన్స్ (తాత్కాలిక) జారీ చేశారు. చట్టపరమైన లాంఛనాలు అన్నీ పూర్తయిన తర్వాత ఎక్సైజ్ అధికారులు బార్ ప్రదేశాన్ని తనిఖీ చేసి శాశ్వత లైసెన్స్ మంజూరు చేస్తారు. రెండు విడతల్లో 24 బార్లకు అధికారులు అనుమతులు ఇచ్చారు. ఎమ్మిగనూరు మున్సిపాల్టీ, గూడూరు నగర పంచాయతీ పరిధిలోని బార్లకు ఒక్క దరఖాస్తూ రాలేదు. వాటికి మరోసారి రీ నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు అధికారులు వెల్లడించారు. దరఖాస్తుల ద్వారా దాదాపు రూ.5.15 కోట్లు ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. దరఖాస్తుల ఖరారు విషయంలో కర్నూలు జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఈఎస్ సుధీర్ బాబు తెలిపారు.

ఇదీ యూరియా 'వరుస'!



యూరియా కష్టాలు రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. మండల పరిధిలోని ఉప్పరహాల్ గ్రామానికి గురువారం యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం 7 గంటల నుంచే పెద్ద ఎత్తున తరలివచ్చారు. పట్టాదారు పాస్ పుస్తకాలను వరుసలో పెట్టి నిరీక్షించారు. యూరియా ఒక లోడ్ మాత్రమే రావడంతో వ్యవసాయాధికారి రైతుకు 2 బస్తాల చొప్పున 140 మందికి మాత్రమే అందించారు. మిగత రైతులు యూరియా దొరక్క నిరాశతో వెనుదిరిగారు. – కౌతాళం

ఆక్రమణల తొలగింపునకు చర్యలు తీసుకోండి



అధికారులతో మాట్లాడుతున్న జిల్లా జడ్జి కబర్ది

పత్తికొండ: పట్టణంలో కోర్టు విస్తరణకు గతంలో కేటాయించిన స్థలంలో ఆక్రమణలు ఉంటే నోటీసులు ఇచ్చి తొలగింపునకు చర్యలు తీసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కబర్ది రెవెన్యూ అధికారులకు సూచించారు. గురువారం పత్తికొండ పట్టణంలోని డిగ్రీ కళాశాల పక్కన మన్రోతోపులో గతంలో కోర్టు ప్రాంగణం విస్తరణకు కేటాయించిన స్థలాన్ని జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి లీలా వెంకటశేషాద్రి, పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి జ్యోష్నాదేవితో కలసి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పరిశీలించారు. అనంతరం ఆయన స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ప్రాంగణంలో ఆర్‌డీఓ భరత్‌నాయక్, తహసీల్దార్ హుసేన్‌సాహెబ్‌లతో సమావేశం నిర్వహించారు. రాబోవు రోజుల్లో కోర్టు పరిధి పెరిగే అవకాశం ఉన్నందున కేటాయించిన స్థలంలో ఆక్రమణలను నోటీసులు ఇచ్చి యుద్ధప్రాతిపదికన తొలగించాలన్నారు. భవిష్యత్‌లోనూ ఆక్రమణలకు తావులేకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పత్తికొండ పర్యటనకు వచ్చిన జిల్లా న్యాయసేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి లీలావెంకటశేషాద్రి స్థానిక సబ్‌జైల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

వినియోగదారుల్లో సంతృప్తి స్థాయి పెంచుదాం

- ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు వెల్లడి



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు

కర్నూలు(అగ్రికల్చర్): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తూ సంతృప్తిస్థాయి పెంచాలని ఏపీఎస్‌పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ సంతోష్‌రావు విద్యుత్ అధికారులను ఆదేశించారు. గురువారం కర్నూలు శివారులోని కేవీఎస్ఆర్ ఆడిటోరియంలో పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అనే అంశంపై విద్యుత్ వినియోగదారుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎలాంటి సమస్య ఏర్పడినా తక్షణం స్పందించేందుకు వినియోగదారులకు అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. పనిచేసే చోటనే నివాసం ఉండటం వల్ల వినియోగదారులకు మెరుగైన సేవలు అందించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఏపీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్ గురువయ్య, కర్నూలు సర్కిల్ ఎస్ఈ ఉమాపతి, కర్నూలు టౌన్ ఈఈ శేషాద్రి, ఈఈ ఓబులేసు, డీఈఈలు, ఏడీఈలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటోను ఢీకొన్న బొలెరో వాహనం

- ఒకరు మృతి..ఆరుగురికి గాయాలు


మృతి చెందిన నులక రాముడు


గాయపడిన ఆటో డ్రైవర్ లతీఫ్‌బాషా

అవుకు(కొలిమిగుండ్ల): పాత చెర్లోపల్లె బస్టాప్ వద్ద గురువారం ఆటోను బులెరో వాహనం ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా మరో ఆరుగురు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. రామాపురానికి చెందిన ఆటో డ్రైవర్ లతీఫ్‌బాషా రామాపురం, చెర్లోపల్లెకు చెందిన ప్రయాణికులను ఎక్కించుకుని అవుకు బయలు దేరాడు. మార్గమధ్యలో పాత చెర్లోపల్లె బస్టాప్ సమీపంలోని మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వస్తున్న బొలెరో వాహనం ఢీకొంది. ప్రమాదంలో ఆటో బోల్తా పడటంతో చెర్లోపల్లెకు చెందిన నులక రాముడు(55) అక్కడికక్కడే మృతిచెందగా ఆటో డ్రైవర్ లతీఫ్‌బాషా, రామాపురం శివాలయం పూజారి ఆనంద్‌శర్మతో పాటు మరో నలుగురు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన లతీఫ్‌బాషాను నంద్యాలకు, మిగతావారిని అవుకు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి కేసు నమోదు చేసుకున్నారు.

పాఠశాల భవనం నాణ్యతపై డీఈఓ ఆగ్రహం


గోడను పరిశీలిస్తున్న డీఈఓ శామ్యూల్ పాల్

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని స్థానిక జీనియస్ గ్లోబల్ స్కూల్ భవనం నాణ్యతపై డీఈఓ శామ్యూల్ పాల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పాఠశాలను డీఈఓ తనిఖీ చేశారు. పాఠశాల భవనం నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని యజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 30 రోజుల్లో తరగతి గదుల్లో సీలింగ్ వేయించాలని ఆదేశాలు జారీ చేశారు. అధిక ఫీజులు వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్యతో పాటు బేసిక్ విద్యపై టీచర్లు దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు స్టేట్ సిలబస్ బోధించాలన్నారు. ఎంఈఓలు ప్రైవేట్ పాఠశాలలో నాణ్యత ప్రమాణాలు పరిశీలించాలని, సౌండ్‌నెస్ సర్టిఫికెట్ డిప్యూటీ ఇంజినీర్‌తో పొందాలని డీఈఓ ఆదేశించారు. అనంతరం సీఆర్‌పీలు తమ సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని డీఈఓకు అందజేశారు.

యువకుడి ఆత్మహత్య


బోయ మధు(ఫైల్)

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఎద్దుల మార్కెట్ సమీపంలో బుధవారం అర్ధరాత్రి బోయ మధు(20) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. బోయ శ్రీరాములు, శంకుతలమ్మల కుమారుడు మధు ఆటో డ్రైవర్‌గా ఉంటూ వాటర్‌క్యాన్లను సప్లై చేసేవాడు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తీవ్ర మనోవేదనకు గురయ్యేవాడు. బుధవారం రాత్రి భోజనం చేసిన తరువాత గదిలోకి వెళ్లి పడుకున్నాడు. గురువారం ఉదయం తలుపులు ఎంతకూ తెరవకపోవటంతో తల్లిదండ్రులు బద్దలు కొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు టౌన్ సీఐ శ్రీనివాసులు తెలిపారు.

అక్షరమే ఆయుధం

మీడియా స్వేచ్ఛను హరించాలనుకోవడం తగదు



ప్రశ్నించే హక్కు, సమాజంలో జరిగే తప్పొప్పులను వెలికి తీసే హక్కు మీడియాకు ఉంది. వారి హక్కులను, స్వేచ్ఛను హరించేలా వ్యవహరించడం తగదు. ప్రజలకు వాస్తవాలు తెలియజేస్తున్న సాక్షిపై కూటమి సర్కారు అక్కసు వెళ్లగక్కుతోంది. చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో ఏదో అద్భుతాలు జరుగుతున్నట్లు ఎల్లో మీడియా చూపించే ప్రయత్నం చేస్తోంది. ఇవన్నీ సరికాదని చెబుతున్నందుకు సాక్షి దినపత్రిక ఎడిటర్‌తో పాటు జర్నలిస్టులపై అక్రమంగా కేసులు బనాయించడం సరికాదు. తప్పులు సరిచేసుకోకుండా కక్ష సాధింపులు సిగ్గుచేటు. అసత్యాలపై నిరంతర పోరాటం చేసే సాక్షిని ఆపటం ఎవరి తరం కాదు.

– మాజీ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

మీడియాపై కక్ష సాధింపు మంచిదికాదు



కూటమి ప్రభుత్వం మీడియాపై కక్ష సాధింపు చర్యలకు దిగుతోంది. సాక్షి యాజమాన్యంపై తప్పుడు కేసులు పెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇది మంచి సంప్రదాయం కాదు. మీడియాకు తెలిసిన విషయాలు రాసుకునే స్వేచ్ఛ ఉంది. ఫోర్త్ ఎస్టేట్‌గా పిలిచే మీడియా స్వేచ్ఛను సైతం ఈ ప్రభుత్వం హరించేస్తోంది. వ్యతిరేక వార్తలు వచ్చినప్పుడు రీజాయిండర్ ఇస్తారు. అంతే కానీ వార్త రాసే రిపోర్టర్ల నుంచి ప్రచురించే ఎడిటర్‌పై అక్రమ కేసులు పెట్టడం ఎప్పుడూ చూడలేదు. ప్రభుత్వ తప్పులు, అవినీతి అక్రమాలు రాయకూడదంటూ హుకుం జారీ చేయడం ప్రజాస్వామ్య దేశంలో కుదరదన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలి. రెడ్‌బుక్ రాజ్యాంగం పేరుతో రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు, లోకేష్ ఎమర్జెన్సీ పరిస్థితులు కల్పిస్తూ బెదిరిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమ కేసులు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. – వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఎస్వీ మోహన్ రెడ్డి

బెడిసి కొట్టిన పాసింగ్ కుట్ర!

- వ్యాపారుల కుమ్మక్కుతో తగ్గిన ధర
- నిన్నమొన్నటి వరకు క్వింటం రూ.7,300 పలికిన వేరుశనగ
- ఇలాగే కొనసాగితే పాసింగ్ ప్రక్రియ పునరుద్ధరించరేమోనని వ్యాపారుల భయం
- ధర తగ్గించి క్వింటం రూ.4,568 కొనుగోలు చేసిన వ్యాపారులు
- అంత తక్కువ ధరకు ఇచ్చేది లేదంటూ నిరాకరించిన అన్నదాతలు

ఆదోని మార్కెట్ యార్డులో వ్యాపారుల కుట్రలు తారస్థాయికి చేరాయి. రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్న పాసింగ్ ప్రక్రియను కొద్దిరోజులుగా రద్దు చేయడంతో వారి కుట్రలు అమలు చేసేందుకు సిద్ధమయ్యారు. ఒక్కసారిగా ధర తగ్గించి వేరుశనగలను కొనుగోలు చేసేందుకు వ్యాపారులు యత్నించగా రైతులు దిగుబడులను ఇచ్చేది లేదని తెగేసి చెప్పారు. దీంతో పాసింగ్ ప్రక్రియ లేనిదే కొనుగోళ్లు సాగవనే భ్రమ కల్పించేందుకు చేసిన వ్యాపారుల కుట్రలు బెడిసికొట్టాయి.


రైతులకు ధర నచ్చకపోవడంతో హమాలీలతో దిగుబడులను సంచిలో నింపి నిట్టు వేస్తున్న దృశ్యం

ఆదోని అర్బన్: వ్యాపారుల కుమ్మక్కుతో వ్యవసాయ మార్కెట్‌యార్డులో వేరుశనగ ధర ఒక్కసారిగా పడిపోయింది. రెండు వారాల క్రితం పాసింగ్ ప్రక్రియపై గందరగోళం జరిగిన విషయం విధితమే. అయితే ఈనెల 4న వ్యాపారులు, హమాలీలు, కమీషన్ ఏజెంట్లతో సబ్‌కలెక్టర్ మౌర్యభరద్వాజ్ సమావేశం ఏర్పాటు చేశారు. వ్యాపారులకు పైలట్ ప్రాజెక్టు కింద వారం రోజులపాటు పాసింగ్ లేకుండా వేరుశనగ దిగుబడులను పరిశీలించి తమకు గిట్టుబాటు ధర వేసుకునేలా టెండర్ వేయాలని ఈనెల 8న ఆదేశించారు. అదే రోజు నుంచి వ్యాపారులు పాసింగ్ లేకుండా టెండర్ వేస్తున్నారు. నిన్నటి వరకు క్వింటా రూ.7,300 నుంచి రూ.6,800 వరకు ధర పలికింది. ఇలానే వేస్తే పాసింగ్ రద్దు చేయడం కష్టతరమవుతుందని వ్యాపారులు భావించి గురువారం ఒక్కసారిగా రూ.2,500 తగ్గించారు. మంగళవారం రోజున 425 సంచుల దిగుబడులు మార్కెట్‌యార్డుకు రాగా.. గరిష్ట ధర రూ.7,240 పలికింది. బుధవారం 717 సంచులు రాగా రూ.6,800 గరిష్ట ధర నమోదైంది. గురువారం 974 సంచులు రాగా రూ.4,568 గరిష్ట ధర పలికింది.

నష్టపోతున్న రైతులు

పాసింగ్ లేకుండా యథావిధిగా దిగుబడులను కొనుగోలు చేస్తారనే ఆశతో రైతులు గురువారం తమ దిగుబడులను మార్కెట్‌కు తీసుకొచ్చారు. వ్యాపారులు ఒక్కసారిగా రూ.2,500 తగ్గించి కొనుగోలు చేయడంతో అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పక్కనే ఉన్న ఎమ్మిగనూరు మార్కెట్‌లో రూ.7 వేలకు పైగా ధర పలికిందనే విషయం తెలుసుకున్న రైతులు.. తమ దిగుబడులను అంత తక్కువ ధరకు ఇచ్చేది లేదంటూ తెగేసి చెప్పారు. అమ్మకం కోసం కిందపోసిన దిగుబడులను మళ్లీ బస్తాలకు నింపుకుని నిట్టు వేసుకున్నారు. వ్యాపారులు తమకు ముందే చెప్పి ఉంటే తాము దిగుబడులను తీసుకొచ్చేవారం కాదని, ఇప్పుడు ఇంటి నుంచి యార్డుకు తెచ్చిన దిగుబడుల ఖర్చు, యార్డులో రాశి పోసి నింపి, నిట్టువేసిన ఖర్చు ఎవరిస్తారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇలాగే చేస్తే యార్డు బంద్ చేస్తాం



వ్యాపారులు ఇలాగే వ్యవహరిస్తే వేరుశనగకాయల దిగుబడుల మార్కెట్ యార్డును బంద్ చేస్తాం. దిగుబడులను పరిశీలించి ధర వేసుకోవాలే గానీ ఇలా రైతులను ఇబ్బందులు పెడితే చర్యలు తప్పవు. వారికి నోటీసులు కూడా సిద్ధం చేశాం. వ్యాపారులు, కమీషన్ ఏజెంట్లతో సమావేశం ఏర్పాటు చేసి చర్చించి సమస్యను పరిష్కరిస్తాం. లేదంటే చర్యలు తప్పవు.

– గోవింద్, యార్డు సెక్రటరీ

భక్తిశ్రద్ధలతో గంధం సమర్పణ


ఎల్లార్తి దర్గాను దర్శించుకుంటున్న భక్తులు

హొళగుంద: ఉరుసులో భాగంగా ఎల్లార్తి శేక్షావలి, షాషావలి తాతలకు గురువారం రాత్రి భక్తిశ్రద్ధలతో గంధం సమర్పించారు. దర్గా నుంచి గంధంతో బయలుదేరి గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించి తిరిగి దర్గాకు చేర్చారు. ఊరేగింపులో భాగంగా భక్తులు కర్రసాము, ఇతర విన్యాసాలను ప్రదర్శించారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులు ప్రత్యేక ఫాతెహాలు చేశారు. శుక్రవారం ఉరుసు, శనివారం జియారత్‌తో ఉత్సవాలతు ముగుస్తాయి. ఉత్సవాలకు వచ్చిన భక్తులకు అవసరమైన ఏర్పాట్లు కల్పించినట్లు వక్ఫ్‌బోర్డు ఈఓ ఇమ్రాన్‌ఖాన్, దర్గా నిర్వాహకుడు షాఫీర్‌ఖాన్ తెలిపారు. ఉరుసులో ఎలాంటి అవాంచనీయ ఘటనలు జరగకుండా పత్తికొండ డీఎస్పీ వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆలూరు సీఐ రవిశంకర్‌రెడ్డి, హొళగుంద ఎస్ఐ దిలీప్‌కుమార్ బందోబస్తు నిర్వహించారు.

సంగమేశ్వరంలో దేవతామూర్తుల విగ్రహాల ఏర్పాటు

కొత్తపల్లి: సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కర ఘాట్‌లో ఉన్న ఉమామహేశ్వర స్వామి ఆలయంలో గురువారం దేవతామూర్తుల నూతన విగ్రహాలను ఏర్పాటు చేశారు. కుంభకోణ క్షేత్రం నుంచి తీసుకొచ్చిన సిద్ధి బుద్ధి సమేత వినాయక స్వామి, శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి, పంచలోహ ఉత్సవ దేవతమూర్తులు, శారద సమేత లలితా సమేత పురాతన బ్రహ్మసూత్ర నర్మదా బాణ లింగ స్వాముల విగ్రహాలను పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో సంగమేశ్వర స్వామి సన్నిధిలో ఏర్పాటు చేశారు.


నూతనంగా ఏర్పాటు చేసిన విగ్రహాలు

షికారీ గ్యాంగ్ అరెస్ట్


షికారీ గ్యాంగ్ సభ్యులను అరెస్టు చూపుతున్న ఆలూరు పోలీసులు

ఆలూరు రూరల్: హైవేల్లో నిలిచిన లారీలను రాబరీ చేస్తున్న షికారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసినట్లు ఆలూరు సీఐ రవిశంకర్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 5న ఆలూరు సమీపంలోని కర్నూలు–బళ్లారి ప్రధాన రహదారిలో లారీ నిలిపి డ్రైవర్ నిద్రిస్తుండగా షికారీ గ్యాంగ్‌కు చెందిన షికారీ పరమేష్, మూర్తి సెల్‌ఫోన్, నగదు చోరీకి యత్నించగా డ్రైవర్ ప్రతిఘటించడంతో కత్తితో దాడి చేసి పారిపోయారు. డ్రైవర్ ఫిర్యాదుతో అప్పట్లో కేసు నమోదు చేశారు. పోలీసు బృందాల ద్వారా సాంకేతికత ఉపయోగించి గాలించి బుధవారం అర్ధరాత్రి ఆలూరు సమీపంలోని ఆంజనేయ విగ్రహం వద్ద అరెస్ట్ చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. కర్ణాటక రాష్ట్రం చిక్కవాడి గ్రామానికి చెందిన పరమేష్, బళ్లారి జిల్లా బసరకోడుకు చెందిన మూర్తి జల్సాలకు అలవాటు పడి హైవేల్లో ఆపిన లారీలను రాబరీ చేసేవారన్నారు. వీరు గతంలో కర్నూలు నాలుగో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని మర్డర్ కేసులో, ఆదోని మూడవ పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో మూడు చోరీ కేసుల్లో కడప సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవించారన్నారు. ఎస్ఐ మహబూబ్ బాషా, ఏఎస్ఐ చంద్రశేఖర్, హెడ్ కానిస్టేబుల్ రంగయ్య, కానిస్టేబుళ్లు కేశవ రెడ్డి, పరశురాం, సుధాకర్, హోంగార్డులు వీరాంజి, రమేష్ ఉన్నారు.

రోడ్ల నాణ్యతపై ప్రత్యేక దృష్టి


రోడ్లను పరిశీలిస్తున్న మురహరిరెడ్డి

కర్నూలు(అర్బన్): పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్ల నిర్మాణాలను పూర్తి నాణ్యతతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని పీఆర్ క్వాలిటీ కంట్రోల్ ఈఈ మురహరిరెడ్డి కోరారు. గురువారం ఆయన జిల్లాలో నాబార్డు నిధులతో చేపడుతున్న పలు రోడ్లను తనిఖీ చేశారు. వెల్దుర్తి–కోడుమూరు ఆర్అండ్‌బీ రోడ్డు నుంచి క్రిష్ణగిరి మండలం టి.గోకులపాడు వరకు రూ.1.50 కోట్లతో చేపడుతున్న రోడ్డు పనులతో పాటు వెల్దుర్తి – కోటకొండ రోడ్డు నుంచి క్రిష్ణగిరి మండలం తొగర్చేడు గ్రామం వరకు రూ.1.20 కోట్లతో చేపడుతున్న రోడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతకు అధిక ప్రాధాన్యతను ఇస్తే పదికాలాల పాటు రోడ్లు మన్నికగా ఉంటాయన్నారు. ఇంజనీర్లు రోడ్ల పనులను తరచూ తనిఖీ చేస్తూ అవసరమైన సలహాలు, సూచనలు చేయాలన్నారు. ఈఈ వెంట పీఆర్ క్వాలిటీ కంట్రోల్ కర్నూలు డీఈఈ ధనిబాబు, పీఆర్ పత్తికొండ డీఈఈ శేషయ్య తదితరులు ఉన్నారు.

రమ్మన్నారు.. వద్దన్నారు!

- ఉపాధ్యాయ నియామక పత్రాల కోసం అమరావతికి పిలుపు
- బయలుదేరేముందు కార్యక్రమం రద్దు అంటూ సమాచారం


వాహనంలో వంట పాత్రలు తరలించేందుకు సిద్ధమవుతున్న కూలీలు

పాములపాడు: కూటమి ప్రభుత్వం అంతా ఆర్భాటం చేస్తోంది. చివరికి తూచ్ అంటోంది. డీఎస్సీలో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికైన వారికి ఈనెల 19న అమరావతిలో నియామక పత్రాలు అందజేసేందుకు చర్యలు చేపట్టింది. ఇందు కోసం ఏపీఎస్ ఆర్టీసీ బస్సులను కేటాయించింది. మార్గమధ్యలో భోజనాల కోసం కాంట్రాక్ట్ ఇచ్చింది. అయితే బస్సులు అమరావతికి బయలుదేరే ముందు కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో అప్పటికే వివిధ ప్రాంతాల్లో చేసిన ఏర్పాట్ల ఖర్చు వృథా అయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి వచ్చే 2,000 మంది కోసం స్థానిక ఏఎస్ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద భోజనాలు సిద్ధం చేశారు. కార్యక్రమం రద్దు అని తెలియడంతో అప్పటికే వండిన భోజనాన్ని పలు పాఠశాలలకు సరఫరా చేశారు. మిగిలినది పడేసి వంట పాత్రలు సర్దుకుని కాంట్రాక్ట్ సిబ్బంది వెనుదిరిగారు. కూటమి ప్రభుత్వం తామే ఉద్యోగాలిచ్చామని గొప్పలు చెప్పుకునేందుకే ఇలాంటి ఆర్భాటాలకు డబ్బు వృథా చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎప్పుడూ లేని విధంగా నియామక పత్రాలు అమరావతిలో ఇవ్వాల్సిన అవసరమేముందని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పనిచేయకుండానే జీతం

- మూడు నెలలుగా ఇదే తంతు
- రాష్ట్ర నాయకునికి ఆ హక్కు ఉందట!


ప్రభుత్వ ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న అకౌంటెంట్ రమేష్‌కుమార్ సీటు

కర్నూలు(హాస్పిటల్): ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్‌కుమార్ ఎంతో బాధ్యత గల నాయకుడు. ఉద్యోగులతో పాటు ప్రజలు సైతం ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత ఆయనది. సాధారణ బదిలీల్లో భాగంగా గత జూన్ నెలలో కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని పరిపాలనా విభాగంలోని అకౌంటెంట్ పోస్టుకు బదిలీపై వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఆయన తన సీటులో కూర్చుంటే ఒట్టు. ఒక్క రోజు కూడా విధులు నిర్వహించకుండానే ప్రతి నెలా రూ.లక్షకు పైగా జీతం మాత్రం డ్రా చేస్తున్నారు. అతనికి జూన్ నుంచి డిసెంబర్ వరకు అదర్ డ్యూటీగా పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం సైతం జీఓ ఆర్‌టీ నెం.1331ను గత జులై 7న విడుదల చేయడం గమనార్హం. ఆసుపత్రిలో వందలాది మంది వైద్యులు, స్టాఫ్‌నర్సులు, పారామెడికల్ సిబ్బంది, నాల్గవ తరగతి ఉద్యోగులు, ఇతర ఉద్యోగుల జీతభత్యాలన్నీ ఈ అకౌంటెంటే నిర్వహించాల్సి ఉంటుంది. రమేష్‌కుమార్ విధులకు రాకపోవడంతో ఆయన బాధ్యతలను మరొకరికి అప్పగించారు. ఇప్పటికే ఉన్న బాధ్యతలతో పాటు అదనపు బాధ్యతలు నిర్వహించలేక వారు సతమతమవుతున్నారు. ఈ కారణంగా రెండు విధులూ ఆలస్యమవుతున్నాయి. విధులకు రాకుండానే జీతం తీసుకునేలా ప్రభుత్వం సైతం ఉత్తర్వులు ఇవ్వడంపై విమర్శలు వ్యక్తవుతున్నాయి.

కవి సమ్మేళనాలతో భాషాభివృద్ధి


అతిథులతో సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

కర్నూలు కల్చరల్: ప్రాచీన భాషల అభివృద్ధికి కవి సమ్మేళనాలు దోహదపడతాయని డాక్టర్ అబ్దుల్ హక్ ఉర్దూ యూనివర్సిటీ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ పీఎస్‌షా వలిఖాన్ అన్నారు. గురువారం ఉర్దూ వర్సిటీలో ఈద్‌మిలాద్ ఉన్ నబీ సందర్భంగా వర్సిటీ ఉర్దూ శాఖ, నేషనల్ కౌన్సిల్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఉర్దూ లాంగ్వేజ్ (ఎన్‌సీపీయుఎల్) సంయుక్త ఆధ్వర్యంలో ఒక రోజు కవి సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ వీసీ మాట్లాడుతూ మహమ్మద్ ప్రవక్త సమాజ శ్రేయస్సు కోసం నేర్పిన సూత్రాలను పాటిస్తూ ఆయన అడుగుజాడల్లో నడవాలన్నారు. ఉర్దూ భాషాభివృద్ధికి కవి సమ్మేళనాలు, సెమినార్లు దోహదపడతాయన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎన్‌సీపీయూఎల్ డైరెక్టర్ డాక్టర్ ఎండీ షంషు ఇక్బాల్ మాట్లాడుతూ ఉర్దూ భాష వాడుక భాషల్లో ఒక మాధ్యమంగా పనిచేస్తుందన్నారు. వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వి.లోకనాథ, ప్రత్యేక అతిథి డాక్టర్ సయ్యద్ ఆరిఫ్ పాషా ఖాద్రి మాట్లాడారు. అనంతరం వివిధ కోర్సుల్లో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు అతిథులు ప్రశంసా పత్రాలను అందజేశారు. ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల మధ్య ఘర్షణ

- పోలీసు స్టేషన్ చేరిన పంచాయితీ

ఆదోని సెంట్రల్: పట్టణంలో పురపాలక ఉన్నత పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల మధ్య గురువారం ఘర్షణ చోటుచేసుకుంది. ఉపాధ్యాయ సంఘాల మధ్య కొంత కాలంగా కోల్డ్ వార్ నడుస్తోంది. అందులో భాగంగానే బుధవారం రాత్రి ఓ ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయుడు వాట్సాప్ గ్రూపులో ఒకరి మీద ఒకరు చాటింగ్ చేసుకున్నారు. గమనించిన గ్రూపు అడ్మిన్లు వాటిని డిలీట్ చేశారు. అంతటితో ఆగకుండా గురువారం ఉదయం ఉపాధ్యాయులు ఇద్దరూ పాఠశాల వద్ద వాగ్వాదానికి దిగారు. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ కొట్టుకునే స్థాయికి వెళ్లారు. తోటి ఉపాధ్యాయులు ఇద్దరిని సముదాయించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాలకు వస్తున్న సమయంలో ఇలా ఘర్షణ పడడంతో పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఉపాధ్యాయులే గొడవ పడటం ఏమిటని పలువురు అసహించుకున్నారు. కాగా ఓ ఉపాధ్యాయుడు మరో ఉపాధ్యాయుడిపై రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా వారు ఇన్‌చార్జ్ హెచ్‌ఎంను, ఎంఈఓను, గొడవ పడిన ఇద్దరు ఉపాధ్యాయులను పిలిపించి సర్దిచెప్పి పంపారు. భవిషత్తులో పునరావృత్తం గాకుండా చూసుకోవాలని చెప్పి పంపారు.

డాక్యుమెంట్ రైటర్లు నేడు, రేపు పెన్‌డౌన్!

- ప్రభుత్వ నిర్ణయంతో డాక్యుమెంట్ల రూపకల్పనలో తీవ్ర ఇబ్బందులు
- మ్యుటేషన్, ఆధార్ ఓటీపీ, పీడీఈ భారాన్ని రైటర్లపై నెట్టడంతో అభ్యంతరం
- పలుమార్లు విన్నవించినా పట్టించుకోని ప్రభుత్వం


జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వ వైఖరితో డాక్యుమెంట్ రైటర్లు పెన్‌డౌన్‌కు పిలుపునిచ్చారు. సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు విన్నవించినా పట్టించుకోకపోవడంతో రెండు రోజులపాటు సేవలను నిలిపేసి నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించారు. శుక్ర, శనివారాల్లో డాక్యుమెంట్ల తయారీకి ఒప్పుకోమని నోటీసులిచ్చారు. దీంతో రిజిస్ట్రేషన్ సేవలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. సేవలు స్తంభించి పోయే ప్రమాదం ఉన్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం గమనార్హం.

లోపాలను సరిదిద్దాలని కోరినా..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 24 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలున్నాయి. డాక్యుమెంట్ల తయారీలో రైటర్లదే కీలకపాత్ర. అరటి పండు ఒలిచి నోట్లో పెట్టినట్లు డాక్యుమెంట్ తయారీ చేసి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నివేదిస్తే నంబర్ వేసి అధికారులు రిజిస్ట్రేషన్ ప్రాసెస్‌ను కానిస్తారు. అయితే కూటమి ప్రభుత్వ తీరుతో డాక్యుమెంట్ తయారీలో కొన్ని లోపాలు ఉన్నాయి. వాటిని సరిచేయాలని కోరుతున్నా పట్టించుకోవడంలేదు. కార్డు ప్రైమ్ 2.0లో ఆధార్ ఓటీపీ విధానాన్ని తీసుకొచ్చారు. ఈ విధానంలో కొనుగోలుదారులు నాలుగుసార్లు, విక్రయించే వారు మూడుసార్లు ఓటీపీ చెప్పాలి. కొందరు విక్రయదారులు ఓటీపీ చెప్పడానికి సంకోచిస్తున్నారు. చెప్పేందుకు ముందుకు వచ్చిన వారికి తీవ్ర సాంకేతిక ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్ ఆధారిత ఓటీపీ సెల్‌ఫోన్‌కు వచ్చేలోపు టైమ్ అవుట్ అవుతుండడంతో మళ్లీ మొదటి నుంచి రావాల్సి వస్తోంది. ఇలా ఒక్క డాక్యుమెంట్‌లో మొత్తం 7 ఓటీపీలు వచ్చేలోపు దాదాపు 30–45 నిమిషాల సమయం పడుతుంది. అలాగే పీడీఈ(పబ్లిక్ డేటా ఎంట్రీ)విధానాన్ని కూడా పూర్తిగా రైటర్ చేయాల్సి వస్తోంది. దీనిని సబ్ రిజిస్ట్రార్ తన లాగిన్‌లో చేసుకోవాల్సి ఉన్నా పట్టించుకోవడంలేదు. దీంతో పీడీఈ నమోదులో తీవ్ర తప్పులు, అలసత్వం నెలకొంటోంది. మరోవైపు మ్యుటేషన్ ప్రక్రియను కూడా రైటర్లే పూర్తి చేయాలని సూచిస్తుండడంతో ఏమైనా తప్పులు దొర్లితే తాము బాధ్యులు కావాల్సి వస్తోందని రైటర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సబ్ రిజిస్ట్రార్లు, వారి సిబ్బంది చేసుకోవాల్సిన పనులను తమతో చేయిస్తుండడంతో తీవ్ర పనిభారం, సమయం వెచ్చించాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆయా సమస్యలను పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడంతో పెన్‌డౌన్‌కు సిద్ధమయ్యారు. ఈక్రమంలో శుక్ర, శని వారాల్లో పెన్ డౌన్ కార్యక్రమాన్ని చేపడుతుండడంతో రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించిపోయే అవకాశం ఉంది.

ఉప్పొంగిన బుచ్చమ్మ కుంట

- నీట మునిగిన పంట పొలాలు
- స్తంభించిన రాకపోకలు


కంపమల్ల సమీపంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న బుచ్చమ్మ కుంట


వరద పోటెత్తడంతో నిలిచిపోయిన రాకపోకలు


నీట మునిగిన పంట పొలాలు


ప్రమాదకర పరిస్థితుల్లో వాగును దాటిస్తున్న ప్రైవేట్ స్కూల్ బస్ డ్రైవర్

కోవెలకుంట్ల: మండలంలోని కంపమల్ల– ఉయ్యాలవాడ ఆర్అండ్‌బీ రహదారిలో గురువారం బుచ్చమ్మ కుంట ఉప్పొంగి ప్రవహించింది. కుంట ఎగువ ప్రాంతాలతోపాటు వాగులు, వంకలు, పొలాల్లోని నీరంతా కుంటలో చేరడంతో కుంటపై లెవల్ వంతెనపై వరదనీరు పోటెత్తింది. ఆర్అండ్‌బీ రహదారిపై వరదనీరు ఉధృతంగా ప్రవహించడటంతో కంపమల్ల, క్రిష్టిపాడు, హరివరం తదితర గ్రామాల ప్రజలకు కోవెలకుంట్ల, దొర్నిపాడు ప్రాంతాలకు వెళ్లేందుకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆయా గ్రామాల ప్రజలు ఉయ్యాలవాడ మీదుగా రాకపోకలు కొనసాగించారు. కుంట పరివాహకంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన మిరప, వరి, మినుము, తదితర పంటలు నీట మునిగి నష్టం వాటిల్లింది.